ప్రజాశక్తి
ఆదివారం 18 డిసెంబర్ 2022

రామస్వామిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామ తీర్థం రామస్వామిని హైకోర్టు న్యాయమూర్తి వి.సుజాత , రిజిస్ట్రార్ ఎ.గిరిధర్ శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కమిషనర్ డి.వి.వి. ప్రసాద్, వైదిక సిబ్బంది పూర్ణ కుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఆలయ ఎసి

అనంతరం రామస్వామి ఫోటో, క్షేత్ర మహత్యం పుస్తకం అందజేసి, ఆలయ స్థల పురాణం విశిష్టతను తెలిపారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

- చెరువులు, ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు
- నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు

మట్టి తవ్వేసిన ప్రాంతం

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలిలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో రాత్రి సమయాల్లో అక్రమంగా మట్టి తవ్వి ఎత్తుకు పోతున్నారు. అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవాల్సిన ప్రభుత్వ యంత్రాంగం చూసిచూడనట్లు వ్యవహరిస్తోంది. మట్టి తవ్వకాలకు అనుమతులు తీసుకోవాల్సి ఉన్నా ఎక్కడ తీసుకోవడం లేదు.

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చెరువులలో అక్రమంగా మట్టి తవ్వి కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. పట్టణ సమీపంలో ఉన్న కోటి చెరువు, గ్రోత్ సెంటర్‌కు అనుసరించి ఉన్న స్వామివారి చెరువు, ఎం.బూర్జవలస, మెట్టవలస, పనుకువలస, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పలు చెరువులలో మట్టిని అక్రమంగా తవ్వేస్తున్నారు. ఈ తవ్వకాలతో చెరువులలో పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో వర్షా కాలంలో వరదనీరు చేరి పశువులు, పశువుల కాపర్లు, పొలానికి నీరు కోసం చెరువులలో దిగే రైతులు ఆ గోతుల్లో దిగి మృత్యువాత పడుతున్నారు. గున్నతోటవలస చెరువులో ఏడాది క్రితం ఒక రైతు గోతిలో పడి మరణించాడు. ఎపిఐఐసి భూముల్లో రాత్రి సమయాల్లో మట్టి మాఫియా తవ్వకాలు చేస్తున్నారు. సాలూరు రైల్వే ట్రాక్ కు అనుసరించి ఉన్న ఆరు ఎకరాల ఎపిఐఐసి భూముల్లో వారం రోజులుగా రాత్రి సమయాల్లో మట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తున్నారు. పరిశ్రమల కోసం కేటాయించిన భూముల్లో మట్టిని తవ్వి గోతులు చేస్తే పరిశ్రమల ఏర్పాటుకు ఎవరు ముందుకు వస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. టిడ్కో ఇళ్లకు వెళ్లే దారిలో రామన్నదొరవలస గిరిజనుల భూముల్లో గ్రావెల్ ఉండడంతో రాత్రి సమయాల్లో యథేచ్ఛగా తవ్వి తరలిస్తున్నారు.

రాత్రి సమయాల్లో తవ్వేస్తున్నారు

ఎపిఐఐసి భూముల్లో రాత్రి సమయాల్లో మట్టిని తవ్వేస్తున్నారని ఎపిఐఐసి జెఇ రాజేష్ అన్నారు. తవ్వకాలను అడ్డుకునేందుకు రాత్రి సమయాల్లో నిఘా పెడితే తవ్వడం లేదని, తాము లేని సమయంలో మట్టిని తవ్వేస్తున్నారని తెలిపారు. తవ్వకాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

విద్యపై ఖర్చు భవిష్యత్తుకు పెట్టుబడి

- ఉపాధి కల్పనా కోర్సులకు అధిక ప్రాధాన్యత : విద్యాశాఖామంత్రి బొత్స
- జెఎన్‌టియులో నూతన భవనాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విద్యకోసం ప్రభుత్వం చేసే ఖర్చు, రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు పెట్టుబడి లాంటిదని, రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. స్థానిక జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయంలో రూ.11కోట్లతో నిర్మించనున్న పరీక్షా కేంద్రానికి, రూ.8కోట్లతో నిర్మించనున్న సమావేశ మందిరానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు సంబధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి బొత్స మాట్లాడుతూ, విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఇప్పటికే వేలాది కోట్ల రూపాయలను విద్యకోసం వెచ్చించారని, ఇది మానవ వనరులకోసం పెట్టిన పెట్టుబడి అని చెప్పారు. ప్రాథమిక విద్యతోపాటు, ఉన్నత విద్యకు కూడా సమాన ప్రాధాన్యత కల్పించామన్నారు. చదువు పూర్తి కాగానే ఉపాధి కల్పించే కోర్సులకు, నైపుణ్య శిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం నైపుణ్యం గల మానవ వనరుల కోసం ఎన్నో దేశాలు మన రాష్ట్రానికి వస్తున్నాయని చెప్పారు. సుమారు 30వేల మంది నర్సులు కావాలని, జర్మనీకి చెందిన ఒక సంస్థ ఇటీవలే రాష్ట్రానికి వచ్చిందన్నారు. దాదాపు 89వేల మందికి మైక్రోసాఫ్ట్ శిక్షణ ఇచ్చి, సాఫ్ట్ వేర్ నిపుణులుగా తీర్చిదిద్దామన్నారు. 26వేల మందికి ఉద్యోగాలు కల్పించేందుకు సింగపూర్‌కు చెందిన కంపెనీతో ఒప్పందం జరిగిందని చెప్పారు. జెఎన్‌టియును అభివద్ధి చేయడం ఒక బాధ్యతగా భావించి, తన కర్తవ్యాన్ని నిర్వహించానని చెప్పారు.

శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపి బెల్లాన

కురుపాంలో రూ.150 కోట్లతో నిర్మిస్తున్న గిరిజన ఇంజినీరింగ్ కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. దీనిలో గిరిజనులకు కొంత కోటా కేటాయించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ, విద్యకు, కళలకు ఎంతో పేరుపొందిన విజయనగరంలో ఏర్పాటు చేసిన జెఎన్‌టియు విశ్వవిద్యాలయం కూడా, దేశంలోనే గొప్ప విద్యాసంస్థగా గుర్తింపు పొందుతుందని అన్నారు. జెఎన్‌టియులో పనిచేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్‌కు టైమ్ స్కేల్‌ను వర్తింపజేయాలని మంత్రిని కోరారు. జెఎన్‌టియుజివి వైస్ ఛాన్సలర్ జివిఆర్ ప్రసాదరాజు, ఛీఫ్ ఇంజనీర్ వి.శ్రీనివాసులు, రిజిస్ట్రార్ జి.స్వామినాయుడు, వైస్ ప్రిన్సిపాల్ గురునాథ్ మాట్లాడారు.

కార్యక్రమంలో ఎంఎల్‌సి డాక్టర్ పి.సూర్యనారాయణరాజు, రాజాం ఎంఎల్‌ఎ కంబాల జోగులు, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, జెఎన్‌టియుజివి డైరెక్టర్ జయసింహ, ప్రిన్సిపాల్ శ్రీకుమార్, వివిధ విభాగాల ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే సుస్థిరాభివృద్ధి

- ప్రజా ఆరోగ్యానికి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి
- జిల్లా అధికారుల సమావేశంలో ముఖ్యమంత్రి సిఇఒ సమీర్ శర్మ

ప్రజాశక్తి-విజయనగరం

వివిధ విభాగాల్లో పని చేస్తున్న జిల్లా, క్షేత్ర స్థాయి అధికారుల సమష్టి కృషితోనే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోగలమని మాజీ సీఎస్, ముఖ్యమంత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సమీర్ శర్మ పేర్కొన్నారు. జిల్లా స్థాయి అధికారులకు, కింది స్థాయి ఉద్యోగులకు మధ్య సమాచార లోపం ఉండకూడదని, పటిష్ఠమైన సమాచార వ్యవస్థను రూపొందించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన వివిధ రకాల యాప్‌లను వినియోగించటం ద్వారా ఎప్పటికప్పుడు ప్రగతి నివేదికలను, సమాచార నివేదికలను ఆన్‌లైన్ ప్రక్రియలో నమోదు చేసుకోవచ్చని హితవు పలికారు. ఒక్కరోజు పర్యటనలో భాగంగా శనివారం జిల్లాకు విచ్చేసిన ఆయన స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారితో కలిసి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై వివిధ విభాగాల అధికారులతో సమీక్షా నిర్వహించారు. సామాజిక సమతుల్యత దెబ్బతినకుండా అన్ని వర్గాల ప్రజలకు అన్ని రకాల సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని, ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు చేయటం ద్వారా వారి ఆరోగ్య పరిరక్షనకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. వైద్యారోగ్య శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో

సమావేశంలో మాట్లాడుతున్న సమీర్ శర్మ

ముందుకెళ్లాలని చిన్నారుల, మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పారిశుధ్య చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టాలని, కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. సమావేశంలో భాగంగా జిల్లా కలెక్టర్ సూర్యకుమారి సుస్థిరాభివద్ధి లక్ష్యాల సాధనకు జిల్లాలో అనుసరిస్తున్న విధానాలు, అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. సిపిఒ బాలాజీ జిల్లాలో చేపట్టిన చర్యల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసి ప్రగతి ఫలాలను వివరించారు. సమావేశంలో అన్ని విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సఖి గ్రూపుల్లో ప్రజాప్రతినిధులకు భాగస్వామ్యం

ప్రజాశక్తి-విజయనగరం

సఖి గ్రూపుల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి కోరారు. సఖి గ్రూపుల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో ప్రత్యక్షంగా, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర మండల స్థాయి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా శనివారం సమావేశాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జెడ్‌పిటిసి, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లను సఖి సమావేశాలకు ఆహ్వానించాలని చెప్పారు.ప్రతీనెలా మొదటి శనివారం మండల స్థాయిలో, మూడో శనివారం జిల్లా స్థాయిలో, 4వ శనివారం గ్రామ, వార్డు స్థాయిలో సఖి గ్రూపు సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించాలని చెప్పారు. మండల స్థాయి గ్రూపులకు ఎంపిడిఓలు, మున్సిపాల్టీల్లో మున్సిపల్ కమిషనర్లు కన్వీనర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. శారీక, మానసిక ధారుఢ్యం కోసం సఖి గ్రూపు సభ్యులందరికీ యోగా చేయించాలని సూచించారు. సమావేశంలో డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ ఎస్‌వి రమణకుమారి, ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారి, జెడ్‌పి సిఇఒ ఎం.అశోక్‌కుమార్, సిపిఒ పి.బాలాజీ, డిఇఒ లింగేశ్వరరెడ్డి, డిపిఎం బి.పద్మావతి, డిఆర్‌డిఎ ఎపిడి సావిత్రి, జిల్లా బిసి సంక్షేమాధికారి యశోధనరావు, ఇతర సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

అండర్ 14 క్రికెట్ జట్టు ఎంపిక

విజయనగరం టౌన్ :స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో అండర్ 14 క్రికెట్ జట్టు ఎంపిక శనివారం పూర్తయ్యింది. జిల్లా వ్యాప్తంగా 100 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల మధ్య పోటీ నిర్వహించి ప్రతిభ ఆధారంగానే ఎంపిక చేశామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వి రమణ తెలిపారు. ఎంపిక ప్రక్రియలో వ్యాయామ ఉపాధ్యాయుల బంగార్రాజు, నాని పాల్గొన్నారు.

రాష్ట్ర సైక్లింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

:ఈనెల 18వ తేదీన కృష్ణాజిల్లాలోజరుగనున్న రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు జిల్లాజట్టు ఎంపిక శనివారం జరిగింది. ఎంపికైన క్రీడాకారులకు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎమ్మెస్ ఎన్ రాజు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి వేణుగోపాలరావు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు·

పూర్తిస్థాయి పెన్షన్ ఉద్యోగుల హక్కు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పూర్తిస్థాయి పెన్షన్ ఉద్యోగుల హక్కు అని, దాన్ని ప్రభుత్వాలు ఇవ్వాల్సిందేనని తపాలా శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు కె.నారాయణరావు డిమాండ్ చేశారు. శనివారం పెన్షనర్స్‌డే సందర్భంగా ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జె.రామారావు అధ్యక్షతన స్థానిక జెడ్‌పి మినిస్టీరియల్ భవనంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ అనేది యజమాని తన ఇష్టాన్ని బట్టి చెల్లించేది కాదని, దయా దాక్షిణ్యాలను బట్టి చేసే దానమూ కాదని, అది ఒక సామాజిక సంక్షేమ చర్య అని తెలిపారు. ఉద్యోగులు తమ జీవితాల్లోని అతి ముఖ్యమైన కాలాన్ని ప్రభుత్వ సేవకు అంకితం చేసినందున ఉద్యోగ విరమణ అనంతరం వారి జీవితాలు సవ్యంగా సాగిపోయేలా చూడడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. నూతన ఆర్థిక విధానాలు అమలు మొదలయ్యాక ఉద్యోగులు,కార్మికుల హక్కుల మీద దాడులు పలు రూపాల్లో ప్రారంభమయ్యాయని తెలిపారు. వాటిలో భాగంగానే పెన్షన్ మీద దాడి కూడా ఉందన్నారు. 2003లో తెచ్చిన కొత్త పెన్షన్ స్కీము ఉద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. ఈ స్కీము ద్వారా ఉద్యోగుల జీతాలనుండి మినహాయించే సొమ్ము యావత్తూ పిఎఫ్‌ఆర్‌డిఎ వద్దకు చేరుతుందని, అక్కడి నుండి స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెడతారని, .ఆ స్టాక్ మార్కెట్ జూదం సంగతి అందరికీ తెలిసిందేనని అన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు సిపిఎస్ విధానం రద్దు చేయాలని చాలా కాలం నుండి ఆందోళనలు సాగిస్తున్నా జగన్ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల కారణంగా పెన్షన్ హక్కుకు ముప్పు వాటిల్లిందని, ఉద్యోగులు, పెన్షనర్లు అందరూ ఏకమై పోరాడాల్సిన తరుణం వచ్చిందని అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, పోస్టల్ యూనియన్ అధ్యక్షులు ధర్మారావు, నెల్లిమర్ల జ్యూట్ రిటైర్మెంట్ నాయకులు కె.రామారావు, ఎల్‌ఐసి నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

పింఛను పొందడం సామాజిక హక్కు

ఏళ్ల తరబడి జీవితాన్ని వృత్తికి అంకితం చేసిన అనంతరం, శేష జీవితాన్ని ఆనందంగా గడిపేందుకు సామాజిక భద్రతగా పెన్షన్ పొందడం సామాజిక హక్కు అని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ప్రభుత్వ పింఛన్‌దారుల సామాజిక భవనం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సుదీర్ఘ సేవలకు ప్రతిఫలం వృద్ధాప్యంలో అందించే ఒక సదుపాయం పింఛను అని అన్నారు. డైరెక్టర్ ట్రెజరీస్ రాష్ట్ర సంచాలకులు డాక్టర్ ఎన్.మోహన్ రావు మాట్లాడుతూ ప్రభుత్వపరంగా పింఛనుదారులకు వచ్చే రాయతీలతో పాటు, హామీలకు సంబంధించి పెండింగ్ సమస్యలను నెరవేర్చే దిశగా తాను బాధ్యత తీసుకుంటానని అన్నారు. పింఛనుదార్ల సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దింటి అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు జె. మురళి, రాష్ట్ర ఉపాధ్యక్షులు డివి రమణ, రాష్ట్ర పింఛను దారుల సంఘం ఉపాధ్యక్షులు జిఆర్ రాఘవ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నారాయణ, పట్టణశాఖ అధ్యక్షులు వడ్డాది సూర్యనారాయణ, పట్టణశాఖ ప్రధాన కార్యదర్శి సిహెచ్ త్రినాథ్ ప్రసాద్ తదితరులు మాట్లాడారు.

దండం పెడుతూ నిరసన తెలుపుతున్న పెన్షనర్లు, సంఘం నాయకులు

మోడీ.. మీకు దండం పెడతాం...
ఇపిఎఫ్ పెన్షన్ పెంచండి

ఇపిఎఫ్ పింఛనుదారులు వినూత్న నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

'మోడీ.. మీకు దండం పెడతాం. ఇపిఎఫ్ పెన్షన్ పెంచండి' అటూ పెన్షన్ దారులు వినూత్న నిరసన తెలిపారు. పెన్షనర్స్ డే సందర్భంగా శనివారం ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఇపిఎఫ్ పెన్షన్ పెంచాలని కోరుతూ మోడీకు దండం పెడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపిఆర్‌పిఎ జిల్లా కార్యదర్శి పి.శంకరరావు, మండల నాయకులు భుజంగరావు మాట్లాడుతూ దేశంలో నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ ఇపిఎఫ్ పెన్షన్ పెంచకపోవడం అన్యాయమన్నారు. పెన్షన్ ఉద్యోగులకు ఇస్తున్న భిక్షం కాదని, హక్కు అని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా పెన్షన్ పెంచకపోవడం అన్యాయమన్నారు. పెరుగుతున్న ధరలతో అరకొర పెన్షన్‌తో ఎలా బతకాలని ప్రశ్నించారు. ఇపిఎఫ్ పెన్షన్ రూ.9వేలుకు పెంచాలని డిమాండ్ చేశారు. లేదంటే పోరాటం ఉధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బలరాంనాయుడు, టి.రామకష్ణ, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బలరాం నాయుడు, తాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన జయప్రదానికి టిడిపి సన్నాహాలు

ప్రజాశక్తి -విజయనగరం కోట

'ఇదేమి కర్మ రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఈనెల 22 నుంచి 24 వరకు చేపట్టిన జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. పర్యటన ఏర్పాట్లపై శనివారం అశోక్ బంగ్లాలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్‌గజపతిరాజు, జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాలను అభివృద్ధి చేయడం లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని చెప్పారు . ప్రతి 50 ఇళ్లకు ఒక గుండా సైన్యాన్ని సిద్ధం చేసి ప్రజల మీదకి వదులుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గుండాయిజానికి ప్రభుత్వం, ముఖ్యమంత్రి కొమ్ముకాస్తున్నారని ఆక్షేపించారు. ఈనెల 22న రాజాం, 23న ఉదయం బొబ్బిలి, 24వ తేదీ సాయంత్రం విజయనగరం పట్టణంలో రోడ్డు షో, అనంతరం కోట వద్ద పబ్లిక్ మీటింగ్ ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు ప్రతిభా భారతి, గుమ్మిడి సంధ్యారాణి , అదితి గజపతిరాజు, బొబ్బిలి చిరంజీవులు, ద్వారపురెడ్డి జగదీష్, ఆర్‌పి భంజదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెంచూరియన్ స్నాతకోత్సవం

విద్య, ఆర్థిక రంగాల్లో ప్రపంచ రారాజు భారత్ : గవర్నర్ బిశ్వభూషణ హరిచందన్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వ విద్యాలయం ద్వితీయ స్నాతకోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ హరిచందన్ వర్చ్యువల్‌లో పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరో ఐదేళ్లలో భారత్ ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడం ద్వారా భారత్ పూర్వ వైభవం సంతరించుకోనుందన్నారు. రానున్న ఐదేళ్లలో మన ఆర్థిక వ్యవస్థ 5 ట్రలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అటువంటి ఆర్థిక వ్యవస్థలో పాలుపంచుకోవడానికి నైపుణ్యం కలిగిన విద్యార్థులు అవసరమని అందుకు సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. దేశంలోనే నైపుణ్య విద్యను అందించడంలో సెంచూరియన్ మొదటి స్థానంలో ఉందని, రానున్న కాలంలో నూతన విద్యా విధానం అందుకు మరెంతగానో తోడ్పడగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఛాన్సలర్ డాక్టర్ దేబి ప్రసన్న పట్నాయక్ మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థలో అవకతవకలు, సాంకేతికత వినియోగం తక్కువగా ఉండటం వల్ల సమాజంలో ఆర్థిక అసమానతలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ దుస్థితి నుంచి

డిగ్రీ పట్టాలు అందుకున్న విద్యార్థులతో విసి, అతిథులు

స్నాతకోత్సవ సభలో మాట్లాడుతున్న యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రసన్నపట్నాయక్

బయటపడాలన్నారు. 5జి టెక్నాలజీ రాకతో ఈ అసమానతలు తగ్గుముఖం పట్టవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రపంచ స్థాయి నైపుణ్య విద్యను విద్యార్థులకు అందించేందుకు తాము కృషి చేస్తున్నామని సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్‌ఎన్ రాజు చెప్పారు. వచ్చే ఏడాది ఎంబిఎ కోర్సులు ప్రవేశపెట్టనున్నా మన్నారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా నిరు పేదలకు వివిధ రంగాలలో ఉచిత శిక్షణ, ధ్రువపత్రాలు అందజేస్తున్నట్లు వివరించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి ముదే సేవల నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు సానుకూల దృక్పథంతో ఉండాలన్నారు. 2030 నాటికి పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయన్నారు. వివిధ విభాగాలలో ప్రతిభ చూసిన పది మంది విద్యార్థులకు పది బంగారు పతకాలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ప్రోత్సాహక బహుమతి కింద రూ.10వేలు నగదును అందజేశారు. అనంతరం 149 మంది విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధ్యక్షులు డాక్టర్ ముక్తికాంత్ మిశ్రా, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డిఎన్ రావు, ఒడిశా క్యాంపస్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సుప్రియా పట్టనాయక్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, గవర్నింగ్ బాడీ సభ్యులు, అకాడమిక్ కౌన్సిల్ సభ్యులు, ప్రొఫెసర్ పద్మరాజు, ప్రొఫెసర్ మల్లికార్జున, పలువురు డీన్లు , విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజల జీవితాలతో ముడి.. సమగ్ర భూ సర్వే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వందేళ్ల తరువాత గ్రామ కంఠాలు, భూముల సర్వే జరుగుతోంది. ఈ కార్యక్రమానికి జగనన్న సమగ్ర భూ సర్వే అనే పేరుపెట్టారు. తద్వారా హక్కుదారులకు మరింత భద్రత చేకూరుస్తామన్నది ప్రభుత్వం చెబుతున్నమాట. ఇందుకోసం అధికారులు, సర్వేయర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఇప్పటి వరకు జిల్లాలో గ్రామ కంఠాల సర్వే పూర్తయింది. ఎప్పుడో ఏర్పడిన గ్రామాలు విస్తరించిన నేపథ్యంలో తాజా సర్వే ద్వారా ప్రస్తుతం స్వరూపాలు మారుతాయి. ఆయా గ్రామాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను గుర్తింపు పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రెండో దఫా సర్వే ప్రారంభమైంది. డ్రోన్ల సాయాంతో ముందుకు మ్యాపింగ్ చేసి,

పంటపొలాలు, గట్లు, పుట్టలు, అందులో ప్రభుత్వ భూములు, ఫారెస్టులను గుర్తిస్తామని చెబుతున్నారు. ఇందుకోసం రెండో దఫా శిక్షణ కార్యక్రమం కూడా దశలవారీగా కొనసాగుతోంది. ఈసర్వే ప్రజల జీవితాలతో ముడిపడి ఉందని, సర్వే సిబ్బంది ఏమాత్రం ఏమరపాటుగా వ్యవహరించినా, నిర్లక్ష్యం వహించినా, అధికారులు లేదా సిబ్బంది ప్రలోభాలకు గురైనా తాత తండ్రుల నాటి భూములు భూబకాసురులు, కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లేందుకు అవకాశం ఉందని భూ వ్యవహారాలపై కాస్త అవగాహన్న వారంతా చర్చిస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. భూముల వివరాలు ఆన్‌లైన్ చేసే పేరుతో గత ప్రభుత్వం వెబ్‌ల్యాండ్ పథకాన్ని రూపొందించింది. కేవలం కొన్ని నెలలు సమయం ఇచ్చి, ఆలోగా పని పూర్తి కావాలని రెవెన్యూ అధికారులు, సిబ్బంది మెడపై కత్తిపెట్టారు. దీంతో, తీవ్ర ఒత్తిడితో పనిచేయడం వల్ల ఆన్‌లైన్ నమోదు అంతా తప్పుల తడకగా మారింది. అన్న భూమి తమ్ముడికి, తమ్ముడి భూమి అన్నకి, లేదా పక్కపక్కనేవున్నా ఇతర భూ హక్కుదారులకు దఖలయ్యాయి. వీటిని సరిచేసుకోవడానికి ఇప్పటికీ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా క్రయ విక్రయాల్లో ఈ డొల్లతనం బయటపడుతోంది. పూర్వపు భూ రికార్డులు అందుబాటులో ఉండడం వల్ల కొంతలోకొంతైనా ఈ సమస్యలు పరిష్కామౌతున్నాయి. రికార్డులు అందుబాటులో ఉన్నప్పటికీ పరిష్కరంచుకునే చొరవలేనివారు ఇప్పటికీ తమ భూములు దరిచేరలేని పరిస్థితి. కొన్నిచోట్ల ఒకరి భూములు మరొకరు విక్రయించుకున్న సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో చేపడుతున్న రీసర్వేను ఆషామాషీగా చూడడానికి వీలు లేదు. సర్వేలో ఎన్నో నిబంధనలు, ప్రామాణికాలు తీసుకున్నప్పటికీ అధికారులు రాజకీయ ఒతిళ్లకు, బెదిరింపులకు గురైనా, లేక పారదర్శకంగా వ్యవహరించకపోయినా హక్కుదారుల జీవితాలు అంధకారంలోకి నెట్టబడతాయనడంలో సందేహం లేదు. ఎందుకంటే, ప్రతి గ్రామాల్లోనూ భూ వివాదాలు ఉన్నాయి. అమాయక ప్రజల భూములు లీజుపేరిట, ఆక్రమణ పద్ధతిలోనే భూస్వాములు లేదా రాజకీయ, ఆర్థికబలం ఉన్నవారి చేతుల్లోవున్నాయి. గ్రామ సభల్లోనూ వారిదే పైచేయిగా నిలిచే ప్రమాదం లేకపోలేదు. గతం మాదిరిగా భూములు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం కాదు. ఉన్న స్థితిని యథాతథంగా రికార్డుల్లోకి ఎక్కిస్తామని చెబుతున్నారు. ఈనేపథ్యంలో పాదర్శకత, జవాబుదారితనం లోపిస్తే జీవితాలే అతలాకుతలం అయ్యే ప్రమాదం ఉందని జనం చర్చించుకుంటున్నారు.

పంట నీరు ప్రణాళికపై అవగాహన

మాట్లాడుతున్న సర్పంచ్ సుబ్రమణ్యం

జామి : మండలంలోని చింతాడ గ్రామంలో శనివారం నమోదిత చెరువు ఆయకట్టు దారులకు గ్రామ సచివాలయం వద్ద భూగర్భ జల గణన శాఖ ఆధ్వర్యంలో 'పంట–నీరు ప్రణాళిక' పై ఒక రోజు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎ. సుబ్రమణ్యం మాట్లాడుతూ 'పంట నీరు ప్రణాళికలో' భాగంగా నీటిని వృథా చేయకుండా తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించడం గురించి వివరించారు. ఖరీఫ్‌లో వేసిన పంటలకు రబీలో వేయబోవు పంటలకు కావలసిన నీటి ఖర్చు వివరాలను తెలియజేసారు. నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు వేసుకోవాలని సూచించారు. బఆర్ఓపిడబ్ల్యుఎ టీమ్ లీడర్ శంకర రావు మాట్లాడుతూ లైన్ డిపార్ట్మెంట్ విధుల బాధ్యతలు గుర్చి చెబుతూ తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించుట, ఏవి పంటలు పండించడం అనే విషయాలు గుర్చి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆర్గోర్ వర్గన్ పట్నాయక్, అగ్రికల్చర్ అసిస్టెంట్ స్వాతి, సెక్రటరీ పార్వతి, సచివాలయం సిబ్బంది, రైతులు దాసరి అప్పలనాయుడు, అమరపల్లి సూర్యనారాయణ, గ్రామపెద్దలు మల్లునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో ధర్మ పథం

నెల్లిమర్ల : రామతీర్థం రామస్వామి దేవస్థానంలో ప్రభుత్వం ప్రతి వారం నిర్వహిస్తున్న ధర్మ పథం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా చీపురుపల్లి మండలం పత్తి కాయలవలసకు చెందిన రామకృష్ణ భజన బృందం పాటల కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా దేవస్థానం సహాయ కమిషనర్ డి.వి.వి. ప్రసాద్, ఉమా సహిత సదాశివ దేవాలయం అర్చకులు రేజేటి మల్లికార్జున శర్మ చేతుల మీదుగా ఆ భజన బృందం సభ్యులకు ప్రభుత్వం జారీ చేసిన ప్రశంసా పత్రాలను అందజేశారు.

లంబసింగిలో టూరిజం రిసార్ట్స్ ప్రారంభం

నెల్లిమర్ల : ఈ నెల 18న లంబసింగిలో నూతన రిసార్ట్స్ ప్రారంభం కానుందని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన నెల్లిమర్లలో విలేకర్లతో మాట్లాడుతూ లంబసింగిలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రూ. 4కోట్లతో నూతనంగా నిర్మించిన రిసార్ట్స్ గదులు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్ కె. రోజా, రాష్ట్ర పరిశ్రమల మంత్రి గుడి వాడ అమర్నాథ్, చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. ప్రారంభ కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టుగుళ్ళి భాగ్యలక్ష్మి, విశాఖ పట్నం జెడ్‌పి ఛైర్‌పర్సన్ జల్లపల్లి సుభద్ర, అరుకు ఎంపి గొడ్డేటి మాధవి, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ అరి మండ వరప్రసాద్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

జగనన్న కాలనీలో తాగునీరు ఏర్పాట్లు

పూసపాటిరేగ : జగనన్న కాలనీలో తాగునీరు కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ వైకుంఠనాయుడు తెలిపారు. శనివారం పూసపాటిరేగలోని జగనన్న లేఅవుట్‌ను సర్పంచ్ టొంపల సీతారాం, ఉప సర్పంచ్ మహంతి జనార్ధనరావుతో పాటు పరిశీలించారు. జగనన్న కాలనీలో నీటి కోసం గతంలో బోర్లు తవ్వి హేండ్ బోర్లు అమర్చారని, మరింత సదుపాయం కోసం పంచాయతీ నిధులు నుండి మోటారు బిగించాలని సర్పంచ్‌ని కోరారు. వెంటనే వారు స్పందించి మోటారు బిగిస్తామని తెలిపారు. వారితో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇలు ప్రవీణ్‌శంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి నాయకులపై దాడికి ఖండన

పూసపాటిరేగ : మాచర్లలో టిడిపి నాయకుడు బ్రహ్మారెడ్డి, కార్యకర్తలపై వైసిపి గుండాలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దాడికి గురైన బ్రహ్మారెడ్డిని అరెస్ట్ చేసారుగాని, దానికి కారణమైన తురకా కిషోర్‌ని అరెస్ట్ చేయకపోవడం అన్యాయమే అన్నారు. కార్లు, బైకులు తగలబెట్టి తీవ్ర విధ్వంసాలకు పాల్పడ్డ రౌడీ మూకలను వదిలేయడం ఘోరమన్నారు. ఈ రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించి రౌడీయిజం రాజ్యమేలుతొందన్నారు. ప్రజల ఆస్థులతో పాటు మాన ప్రాణాలకు రక్షణలేకుండాపోయిందనడానికి మాచర్ల ఘటన నిదర్శనమన్నారు. రాష్ట్రంలో జరుగుతొన్న స్టేట్ స్పాన్సర్ టెర్రరిజంపై కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు.

14వ వార్డులో ఉచిత వైద్య శిబిరం

నెల్లిమర్ల : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తనయుడు డాక్టర్ సందీప్ బాబు జన్మదిన వేడుక సందర్భంగా నెల్లిమర్ల నగర పంచాయతీ 14వ వార్డులో గంటా అప్పలరాజు, వైసిపి నాయకులు గంటా సతీష్, నగర పంచాయతీ ప్రజా ప్రయోజన పరిరక్షణ సమితి అధ్యక్షులు గంటా గౌరీదేవి ఆధ్వర్యంలో విజయనగరం మెడికవర్ హాస్పిటల్ ఫర్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్ ఈసిజి రోగులకు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ చికిత్సలో భాగంగా ఎవరికైనా గుండె సంబంధించి వ్యాధులున్నచో వారిని మెడికవర్ హాస్పిటల్‌కి పంపించి ఉచితంగా గుండెకి సంబంధించి టూడికో, మిగతా పరీక్షలు చేయిస్తామన్నారు. అనంతరం ఉచిత హెల్త్ కార్డులను ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి గంటా బ్రదర్స్ చేతుల మీదుగా రోగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఒ మురళీ, వైద్యులు ఐ.సత్యనారాయణ, సంతోష్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

గరివిడి: స్థానిక అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం మధ్యాహ్నం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజాం రెవ పాస్టర్ ఆర్. శామ్యూల్ మోజెస్ హాజరై మాట్లాడారు. క్రిస్మస్ అనేది ప్రేమ సందేశమన్నారు. ఏసుక్రీస్తు బోధించిన బోధనలు ఇప్పటికీ ప్రపంచమంతా ప్రభావితం చేస్తున్నాయని తెలపారు. బైబిల్ విశిష్టతను వివరిస్తూ క్రీస్తు సందేశాన్ని విద్యార్థులకు తెలియజేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. జాషువ జయప్రసాద్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రజల పాపాలను నివృత్తవం చేయడానికి, ఈ భూమి మీదకు వచ్చారని తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు స్టార్, క్రిస్మస్ ట్రీ, క్రీస్తు జననాన్ని చూపించే పశువుల పాక తయారుచేసి మధురమైన గీతాలు అలపించారు. క్రీస్తు జన్మను సూచించే నాటికితో పాటు, క్రీస్తు ప్రేమను సూచించేలా వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఎఒ జి.అనిల్‌కుమార్, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జీవామృతంతో చీడపీడల నివారణ

వేపాడ : జీవామృతంతో చీడపీడల నివారణ సాధ్యమవుతోందని కొంపల్లికి చెందిన రైతు నర్సిపల్లి వెంకటరమణ అన్నారు. తనకు ఉన్న 10 ఎకరాలు మామిడి తోటల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఒక ట్రాక్టర్ ట్యాంకులో 2వేల లీటర్ల నీరు నింపి అందులో 200 లీటర్ల ద్రవ జీవామృతం, 100 లీటర్ల జిల్లేడు కషాయం కలిపి మామిడి మొక్కలకు శనివారం స్ప్రే చేయించారు. ఈ విధంగా మామిడి తోటలకు స్ప్రే చేయడం వల్ల మామిడిలో వచ్చు చీడపీడలను నివారించవచ్చునని ఆయన తెలిపారు. మామిడి తోటల్లో అంతర పంటగా అపరాలను సాగు చేయడం, కూరగాయలను సాగు చేయడం వల్ల అధిక ఆదాయం వస్తుందని రైతు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల యాంకర్ కే సన్యాసమ్మ, ఐసిఆర్‌పి ఈశ్వరరావు పాల్గొన్నారు.

సచివాలయ సందర్శన

వేపాడ : మండలంలోని సోంపురం గ్రామ సచివాలయాన్ని పంచాయతీ విస్తరణాధికారి సిహెచ్ సూర్యనారాయణ పరిశీలించారు. ఈ పరిశీలనలో జిడిపి, రీ సర్వే, జెఎస్ఎస్ పై చేపట్టిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది విధి నిర్వహణలో ఆలసత్వం వహించరాదన్నారు. సిబ్బందిపై ఆరోపణలు వస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయ పరిధిలో గ్రామ ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ గ్రామ సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ పరిశీలనలో పిఆర్ జెఇ ఎండి ఆలీ, ఎంఇఒ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి నాగమణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

వైయస్సార్ ఫ్యామిలీ ఫిజియన్ వైద్య సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని శృంగవరపుకోట మేజర్ పంచాయతీ సర్పంచ్ గనివాడ సంతోష్ కుమారి కోరారు. శనివారం పట్టణంలోని పంచాయతీ కార్యాలయం వద్ద వైయస్సార్ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 104 వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోపాడ కుమార్, యంపిటిసి వాకాడ సింహాచలం, 104 వైద్యులు జె.హారిక వైయస్సార్ క్లినిక్ సిహెచ్ఒ సి.హెచ్. కళ్యాణి, ఏఎన్ఎం కె. రమాదేవి, హెల్త్ అసిస్టెంట్ బి. రామకృష్ణ, 104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తగ్గేదేలే...!

- అధికారులు హెచ్చరిస్తున్నా పట్టించుకోని మిల్లర్లు
- ప్రజాశక్తి కథనంతో కదలిక
- చర్యలు తీసుకోవాలని డిఎస్ఒకు జెసి ఆదేశాలు

ప్రజాశక్తి – జామి

అది గజపతినగరం మండలం శ్రీ రంగరాజపురం అయ్యప్ప రైస్ మిల్లు.. కొండరోతు లక్ష్మణరావు అనే రైతు ధాన్యం పట్టుకుని వెళ్లాడు.. క్వింటాకు 2.5కేజీలు ధాన్యం అదనంగా ఇస్తేనే, లోడ్ దించుతామని మిల్లర్ డిమాండ్ చేయడంతో ఆ రైతు పూటంతా అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ఒక్క లక్ష్మణరావు మాత్రమే కాదు. సుమారు 60 మంది రైతులు ట్రాక్టర్లతో నిరీక్షించిపోయారు. దీంతో రైతు సంఘం నాయకులకు సమాచారం వచ్చింది. దాంతో వారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో అనివార్యంగా మిల్లరు ధాన్యాన్ని తీసుకున్నారు.

స్పందన....

'అదనపు ధాన్యాన్ని, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న మిల్లు యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలి. అటువంటి మిల్లర్లను బ్లాక్ లిస్టులో పెట్టండి. వారిని ధాన్యం కొనుగోలు నుంచి తప్పించే చర్యలు తీసుకోండి. ధాన్యం అక్రమాలపై స్పందించిన జెసి మయూర్ అశోక్ డిఎస్ఒకు ఆదేశాలు.

'చింత సచ్చినా...పులుపు చావలేదన్న చందంగా ఉంది జిల్లాలో మిల్లర్ల వ్యవహారం. ప్రభుత్వం నిబంధనలు ప్రకారం కొనుగోలు చేయాలని, అందుకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేసినా, జిల్లాలో మిల్లర్లు మాత్రం చేతివాటాన్ని మానుకోవడం లేదు. తాజాగా జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో డొల్ల తనం బయటపడుతున్నా, మిల్లు యాజమాన్యాలు మాత్రం తమ పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం ఏం చెప్పినా, జిల్లా అధికారులు ఎవరేమనుకున్నా, తగ్గేదేలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఈ నేపధ్యంలోనే ప్రజాశక్తి పత్రికలో శనివారం వెలువడిన కథనంతో జిల్లా వ్యాప్తంగా మిల్లర్లు దందా మరోసారి తేటతెల్లమైంది. ఇంత జరుగుతున్నా గజపతినగరంలో ఓ మిల్లు యాజమాన్యం రైతుల నుంచి అదనపు ధాన్యం డిమాండ్ చేయడం వారి బరితెగింపునకు నిదర్శనం. ఈ తరుణంలోనే ఏపి రైతు సంఘం తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. మిల్లర్లు కోరుతున్న అధనపు ధాన్యానికి ఈ ఒక్క రైతు లొంగిపోకుండా తిరగబడాలని రైతు సంఘం జిల్లా నాయకులు బుద్దరాజు రాంబాబు ప్రకటన విడుదల చేశారు. మరో వైపు జిల్లా ఉన్నతాధికారులు కూడా అక్రమాలకు పాలపడుతున్న మిల్లు యాజమాన్యాలపై చర్యలకు ఉపక్రమించాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే జిల్లా పాలకులు కూడా స్పందించి, మిల్లు యాజమానుల అక్రమాలపై చర్యలకు దిగాలని, అప్పుడే, ప్రభుత్వం చెబుతున్న పారదర్శకత అర్థం ఉంటుందని రైతులు అంటున్నారు. అదనపు ధాన్యం అరికట్టడంతో పాటు మిల్లు వద్ద ధాన్యం దించుకునే సమయంలో హమాలీ చార్జీలు వసూలు అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

సైన్సు ప్రదర్శనలను తిలకిస్తున్న ఛైర్మన్ కెఎపి రాజు

ఆకట్టుకున్న రీకూలమిక్ ఎక్స్‌పో

విజయనగరం టౌన్: స్థానిక ఫోర్టు సిటీ పాఠశాలలో శనివారం నిర్వహించిన రీకూలమిక్ ఎక్స్‌పో ప్రదర్శన ఘనంగా జరిగింది. కార్యక్రమంలో స్టేట్, సిబిఎస్ఇ విద్యార్థులంతా ప్రాజెక్టులను తమ సజనాత్మకతతో తయారు చేసి ప్రదర్శించారు. వైజ్ఞానిక, సాంస్కృతిక విషయాలను ప్రాజెక్టుల ద్వారా తల్లితండ్రులకు, ఇతరులకు వివరించారు. పాఠశాల ఛైర్మన్ కె.ఎ.పి. రాజు విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించి వాటి గురించి అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి- మెంటాడ

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు బాల్ బ్యాండ్మెంటన్, సాఫ్ట్ బాల్, షటిల్ రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు తరపున ఎంపికయ్యారు. శుక్రవారం ఎస్.కోటలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా జట్టు ఎంపిక పోటీలలో ప్రతిభ కనబరిచి అండర్ 14 విభాగంలో టి. చరణ్, ఆర్.ఆశ్రిత్, స్టాండ్ బైగా క్రాంతి ప్రియ అండర్ 17 విభాగంలో జి. మౌనిక, అండర్ 19 విభాగంలో ఎం.హిమజ, ఆర్. ప్రేమ్ కుమార్‌లు బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికయ్యారు. షటిల్ బ్యాడ్మింటన్‌లో అండర్ 17 విభాగంలో జి. నందిని స్టాండ్ బైగా ఎంపికైంది. పారాదిలో జరిగిన సాఫ్ట్ బాల్ అండర్ 17లో బి.భావన జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. వీరు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు టి. శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి. హెచ్. అరుణ, స్కూల్ కమిటీ ఛైర్మన్ ఎ.అప్పారావు, ఉపాధ్యాయులు, అభినందించారు.

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ముగ్గురు క్రీడాకారిణులు రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పి.వి.కృష్ణ మూర్తి శనివారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు భరినకాన హారిక, పంపాన మౌనిక, చాముండేశ్వరిలను అధ్యాపకులు ఎ. జనార్ధన్ రావు, జి.ఉమామహేశ్వర రావు, జి.సుష్మ, కె.గోవిందరావు, ఏ. సుమతిలు అభినందించారు. వీరికి తర్ఫీదు నిచ్చిన ఫ్రెండ్స్ బాడ్మింటన్ అకాడమీ చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాముల సేవలను కొనియాడారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 21 వ తేదీ నుండి 23 వతేదీవరకు కడప జిల్లా ప్రొద్దుటూరులో జరగబోవు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

వేపాడ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరోతరగతి విద్యార్థి బత్తిన ప్రణీత్ పార్వతీపురం ఆర్సిఎంఎస్ స్కూల్‌లో నిర్వహించిన అండర్ 14 యోగా పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 22న కాకినాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. శనివారం క్రీడాకారుడును ఉపాధ్యాయులు అభినందించారు.

మండలంలోని బికే నాయుడుపేట ఆదర్శ పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల నెల్లిమర్ల మండలం అలుగోలు గ్రామంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ అండర్ 16, 17 కబడ్డీ పోటీల్లో ఎం. ప్రకాష్ సత్తాను చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వర్‌రావు, పీడీ రమణలు శనివారం అభినందించారు.

విజయనగరం టౌన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో అండర్ 14 క్రికెట్ జట్టు ఎంపిక శనివారం పూర్తయ్యింది. జిల్లా వ్యాప్తంగా 100 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల మధ్య పోటీ నిర్వహించి ప్రతిభ ఆధారంగానే ఎంపిక చేశామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వి రమణ తెలిపారు. ఎంపిక ప్రక్రియలో వ్యాయామ ఉపాధ్యాయుల బంగారాజు, నాని పాల్గొన్నారు.

ఈనెల 18వ తేదీన కృష్ణాజిల్లాలోజరుగనున్న రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు జిల్లాజట్టు ఎంపిక శనివారం జరిగింది. ఎంపికైన క్రీడాకారులకు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎమ్మెస్ ఎన్ రాజు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి వేణుగోపాలరావు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

అర్హత లేకుంటే పెన్షన్లు నిలుపుదల

రేగిడి : వైయస్సార్ సామాజిక పింఛన్లు అర్హత లేకుంటే నిలుపుదల చేస్తామని ఎంపిడిఒ గంగవరపు కాశీ విశ్వనాధరావు అన్నారు. శనివారం మండలంలోని కోడిశ, తునివాడ, నాయిరాలవలస తదితర గ్రామాల్లో వైయస్సార్ సామాజిక పెన్షన్లు తనిఖీలు నిర్వహించారు. ఈ పెన్షన్‌లో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు తదితరకాల పెన్షన్లు అర్హత పై విచారణ చేపడుతున్నారు. అర్హత లేని పెన్షన్లు తొలగించబడతాయని తెలిపారు. వికలాంగులు పెన్షన్లు కోసం తప్పనిసరిగా సదరం ధ్రువీకరణ పత్రం ఉండాలని సూచించారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో టీములవారీగా వైయస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారుల అర్హతను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈయనతో నాయిరాలవలస సచివాలయ పంచాయతీ కార్యదర్శి పెంకి గోపాల్ నాయుడు సచివాలయు ఉద్యోగులు ఉన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తేనే గిట్టుబాటు

రేగిడి : కొలతల ప్రకారం ఉపాధి పనులు చేస్తే రోజు కూలి రూ. 257 గిట్టుబాటు అవుతుందని ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ అన్నారు. మండలంలోని శనివారం చాటాయివలస పంచాయతీలో దేవాంగు వాని చెరువు పనులను ఆయన పరిశీలించారు. ముందుగా ఉపాధి వేతన దారులకు కూలి గిట్టుబాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పనులు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం రెండు పూటలు చేయాలన్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో తప్పనిసరిగా కూలీల హాజరు, ఫొటో అప్లోడ్ చేస్తేనే వేతనాలు వస్తాయని తెలిపారు. పనులు చేసే ముందు వెంటనే ఫోటో అప్లోడ్ చేయాలని సూచించారు. పనుల వద్ద మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ గణపతి రావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ భారతి, మేట్లు వేతనదారులు పాల్గొన్నారు.

సొంతూరిని మరువలేం

హైకోర్టు జడ్జి చీమలపాటి రవి

ప్రజాశక్తి- మెరక ముడిదాం

సొంత ఊరును ఎప్పుడూ మరువలేమని, తమ మీద గ్రామ ప్రజలు చూపిస్తున్న ఆధారాభిమానాలు జీవితాంతం గుర్తుండిపోతాయని రాష్ట్ర హైకోర్టు జడ్జి చీమలపాటి రవి అన్నారు. సొంత ఊరిలో తన తల్లిదండ్రులు చీమలపాటి శ్రీరామమూర్తి, సూర్యకాంతం దంపతుల 60వ వివాహ వార్శికొత్సవం జరగటం చాలా సంతోషంగా ఉందని అన్నారు. మండలంలోని బైరిపురంలో శనివారం ఆయన తల్లిదండ్రుల వివాహ వార్సికోత్సవ్వానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామం అంటే తనకు తన తండ్రికీ ఎంతో ఇష్టమన్నారు. అందుకనే ఎంత కష్టమైనా ఇక్కడ వివాహ వార్శికొత్సవం జరుపుకోవటం అతను ఇష్టపడతారని చెప్పారు. కార్యక్రమంలో శ్రీరామమూర్తి, సూర్యకాంతం దంపతుల కుమారులు చీమల పాటి శేఖర్, కుమార్తె మండా విజయెశ్వరి, గ్రామ సర్పంచ్ పప్పల విజయ కుమారి, ఉపసర్పంచ్ పప్పల కృష్ణమూర్తి, పెద్దలు పప్పల గ్రహణేశ్వరరావు, వైస్ ఎంపిపి కందుల పార్వతి, జిల్లా ఆర్య వైశ్య సంఘం ఉపాధ్యక్షులు కందుల మళ్ళి ఖార్జునరావు, సింగారపు రామకృష్ణ, జెడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ఆర్ ఆచార్యులు, మాజీ సర్పంచ్ కెంగువ ధనంజయ, యూత్ సభ్యులు, జిల్లా జడ్జి సాయి కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా సబ్ జడ్జి శ్రీనివాస్, చీపురుపల్లి జూనియర్ సివిల్ జడ్జి విజయ రామేశ్వరి, మండల తహశీల్దార్ బి. రత్న కుమార్, చీపురుపల్లి సిఐ జి. సంజీవరావు, ఎస్ఐ సన్యాసినాయుడు, గరివిడి ఎసిఐ మురళి తదితరులు పాల్గొన్నారు.

వివాహ వార్సికోత్సవంలో పాల్గొన్న జడ్జి రవి, తదితరులు

ప్రజల చెంతకు పాలన: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కొత్తవలస

గ్రామసచివాలయ వ్యవస్థ దానికి అనుసంధానంగా వాలంటీర్ల వ్యవస్థ ప్రభుత్వ పాలనను ప్రజల చెంతకు చేర్చాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బలిఘట్టం గ్రామ సచివాలయం పరిధిలో ఆయన శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నీలం శెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, కూరకుల సూర్యారావు, బొంతల వెంకటరావు, కొత్తవలస సర్పంచ్ మచ్చా ఎర్రయ్య రామస్వామి, వైస్ సర్పంచ్ చెల్లయ్య, స్థానిక నాయకులు ఆదిరెడ్డి అప్పన్న (నాయుడు), చిటికిరెడ్డి నరేంద్ర, లంక వెంకన్న పాత్రుడు, మిడతాన దేముడు నాయుడు, వార్డు సభ్యుడు రఘు, కంటకాపల్లి సర్పంచ్ మదీనా అప్పల రాము, కాటకాపల్లి సర్పంచ్ పీతల కృష్ణ, ఎంపిటిసి పరదేశి నాయుడు, అడిగర్ల సంతోష్ కుమార్, చిన్నం నాయుడు, కర్రి దేముడుబాబు, వై.మాధవరావు, పోలిపర్తి అప్పారావు, సూరిబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాసేవలో భాగస్వామ్యం కావాలి

- ముఖ్యమంత్రి సిఇఒ సమీర్ శర్మ
- పూసపాటి రేగ, భోగాపురం సచివాలయాల సందర్శన

ప్రజాశక్తి-పూసపాటిరేగ

క్షేత్ర స్థాయిలో ఉండే సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు మనస్ఫూర్తిగా ప్రజాసేవలో భాగస్వామ్యం కావాలని మాజీ సీఎస్, ముఖ్యమంత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి సమీర్ శర్మ పేర్కొన్నారు. శనివారం జిల్లాకు వచ్చిన ఆయన పూసపాటి రేగ, భోగాపురం సచివాలయాలను సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పర్యటనలో భాగంగా పాఠశాల విద్యార్థులు, గర్భిణులతో ప్రత్యేకంగా మాట్లాడారు. స్థానికంగా ఉన్న పరిస్థితులపై, ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, 10 నుంచి 19 ఏళ్ల లోపు బాలికల ఆరోగ్య పరిస్థితి గురించి, బరువు తక్కువగా గల చిన్నారుల గురించి సంబంధిత విభాగాల అధికారులను, సిబ్బందిని ప్రశ్నించారు. రక్తహీనత తక్కువగా ఉండే మహిళలను, చిన్నారులను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి సదుపాయం ఇతర వసతులు సరిగా ఉండేలా చూసుకోవాలని డిఇఒను ఆదేశించారు. నాడు – నేడు పనులకు సంబంధించి తరచూ కన్వర్జెన్స్ సమావేశాలను నిర్వహించుకోవాలని అన్ని విభాగాల అధికారులకు సూచించారు. అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి అవసరాలను తీర్చాలని, వారికేమైనా సమస్యలుంటే నిర్ణీత కాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వ్యవసాయ రంగానికి సంబంధించి భూసార పరీక్షలు, ఈ క్రాపింగ్ ఎప్పటికప్పుడు చేయాలని చెప్పారు. అంగన్ వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందేయాలని సూచించారు. సఖి గ్రూపులను బలోపేతం చేసి సేవలను మరింత విస్తృతం చేయాలని పేర్కొన్నారు. ఆయన వెంట సిపిఒ బాలాజీ, జెడ్‌పి సిఇఒ, డిపిఎం, డిఎంహెచ్ఒ, ఐసిడిఎస్, డిఆర్‌డిఎ, మెప్మా పీడీలు, సచివాలయ జిల్లా కోఆర్డినేటర్, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న సమీర్ శర్మ

'టిక్కెట్ ఎవరికిచ్చినా గెలుపునకు పనిచేస్తా'

ప్రజాశక్తి – శృంగవరపుకోట

నియోజకవర్గంలో టిడిపి టికెట్ ఎవరికిచ్చినా గెలుపునకు కృషి చేస్తానని ఎన్నారై గొంప కృష్ణ అన్నారు. తానా చైతన్య స్రవంతిలో భాగంగా తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13న ఎస్‌కోట పట్టణంలో ఏర్పాటు చేసిన రైతు కోసం తానా కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేందుకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమాన్ని శనివారం మండలంలోని అలుగుబిల్లి గ్రామంలో ఏర్పాటు చేశారు. ఎంపిటిసి రాయవరపు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గొంప కృష్ణ మాట్లాడుతూ కృష్ణా జిల్లాలో తానా టీం విజిట్ చేసినప్పుడు ఆ జిల్లాలో 120 ఇండ్లున్న ఒక పల్లెటూరు అగ్నికి ఆహుతి అయ్యిందని ఆ బాధితులకు ఏమైనా సాయం చేయగలరా అని చంద్రబాబు నాయుడు అడగడంతో తానా ఆధ్వర్యంలో 120 మందికి డబల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ఇచ్చారని ఇప్పుడు ఆ కాలనీ తానా కాలనీగా పిలవబడుతుందని గుర్తు చేశారు. తాను రైతు కుటుంబం నుంచి వచ్చిన వాడినని తన తండ్రి ఇప్పటికీ వ్యవసాయం చేస్తున్నారని అన్నారు. రైతే రాజు రైతే దేశానికి వెన్నెముక అని అంటారని ఈ ప్రపంచానికి ఆహారాన్ని అందించేది రైతేనని కానీ అటువంటి రైతు పరిస్థితి నేడు బాగోలేదని అన్నారు. నష్టం వస్తుందని తెలిసినప్పటికీ కూడా రైతు పంటను పండించి మనకు ఆహారంగా అందిస్తున్నారని, జీతాలు తీసుకునే ఉద్యోగులు ధర్నాలు చేసినట్లుగా రైతులు పంట క్రాఫ్ హాలిడే ప్రకటించినట్లయితే ఆకలి చావులు పెరిగి దేశం అస్తవ్యస్తమవుతుందని అందుకోసమే రైతుకు సాయం చేయాలనే ఉద్దేశంతో తానా ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ముందు చేసే కార్యక్రమాల్లో 50శాతం రైతు కోసమే చేస్తామని ప్రకటించారు. రైతులకు అందజేసిన సేఫ్టీ పరికరాలను ఎలా వాడాలో గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, నానిగిరి రమణాజీ, కలిశెట్టి ఈశ్వరరావు, వేపాడ టిడిపి నాయకులు గొరపల్లి రాము, జామి నాయకులు పైడి రాజు, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గొంప కృష్ణ

ఆర్థికంగా బలోపేతమవ్వాలి

గజపతినగరం : చిన్న సంఘాలు ఆర్థికంగా బలోపేతమవ్వాలని, ఆ ధ్యేయంగా పనిచేయాలని డిఆర్‌డిఎ అదనపు పథక సంచాలకులు కె.సావిత్రి అన్నారు. శనివారం మండల సమైక్య కార్యాలయంలో రెండవ విడత ఎస్. హెచ్.జి ఆడిట్ సి.ఆర్.పిల రెండో రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న సంఘాలు ఆర్థిక లావాదేవీలు సి.ఆర్.పిలు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే ఆడిట్ పక్కాగా ఉండాలని సంఘ లావాదేవీలు ఆడిట్ చేసి ఆ నివేదికను సంఘాలకు ఇవ్వాలని అన్నారు. ఆడిట్‌లో ఎటువంటి తప్పులు, అక్రమాలు బయటపడిన వాటిని రాసుకుని ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. మహిళ సంఘాలలో జరుగుతున్న నిధుల దుర్వినియోగం అరికట్టాలని, పారదర్శకత జవాబుదారీతనంగా ఉండాలని, ఆర్థిక అక్షరాస్యతను సాధించాలని అన్నారు. గ్రామ సంఘాలను బలోపేతం చేయడం దిశగా ఈ ఆడిట్ జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ జే.లక్ష్మునాయుడు, ఎపిఎంలు ఎస్.ఇ.వి.పి ఇందిరా దేవి, ఎస్.సత్యవతి, యు.జగదీష్ కుమార్, ఎల్.సి (సి.సి) భాస్కర్ రావు, పాల్గొన్నారు.

వృద్ధులకు అండగా హెల్ప్ ఏజ్ ఇండియా

గజపతినగరం : వృద్ధులకు అండగా హెల్ప్ ఏజ్ ఇండియా ఉంటుందని ఫీల్డ్ రెస్పాన్స్ టీం లీడర్ శంకర్ నారాయణ, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ జి.సింహాచలం అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పింఛను దారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక స్వాతి కళ్యాణ మండపంలో జాతీయ పెన్షన్ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులకు ఏ సమస్యలు ఉన్నా జాతీయ వృద్ధుల హెల్ప్ లైన్ 14567 సంప్రదించవచ్చు అని అన్నారు. హింసించిన, ఇంటి నుండి బయటకు గెంటి వేయబడిన వృద్ధులకు ఈ సంస్థ అండగా ఉంటుందని, అలాగే పెన్షన్లు, చట్టపరమైన సమస్యలపై సూచనలు చేస్తారని చెప్పారు.

పులిగుమ్మిలో మళ్లీ పులి

ఆవుదూడల పై దాడి

మెరకముడిదాం : మండలంలో పులిగుమ్మి గ్రామంలో శనివారం మరోసారి పులి కలకలం రేపింది. గ్రామానికి చెందిన కెంగువ నారాయణప్పల నాయుడు, చుట్టు అప్పల నాయుడుకు చెందిన మూడు ఆవు దూడలపై పులి దాడి చేయగా అందులో ఒక దూడ చని పోయింది. ఒకటి చనిపోయే స్థితిలో ఉండగా, మరొకటి పులి దాడిలో తీవ్ర గాయలతో తప్పించికున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఇదివరకు ఇదే గ్రామంలో పులి సంచరించి ఆవు దూడాలని చంపేసింది. తరువాత చాలా కాలం కనిపించక పోవటంతో గ్రామ ప్రజలు, మండల ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. శనివారం మరోసారి గ్రామంలో ఆవు దూడాలిపై దాడి చేయటంతో మండల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అటవీ శాఖధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మృతి చెందిన ఆవు దూడ

ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

రేగిడి : మండలంలో సంకిలి గ్రామ ప్రాథమిక పాఠశాల సమీపంలో శనివారం ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పొందూరు నుంచి పాలకొండ ద్విచక్ర వాహనంతో లింగాలా మణికుమార్ వెళ్తుండగా సంకిలి గ్రామానికి చెందిన చింతాడ రామలక్ష్మి ప్రధాన రహదారి దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. వీరువురుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారమందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని ఇఎంటి మీసాల ఈశ్వరరావు, పైలట్ గంగు జగన్నాథరావు క్షత గాత్రులకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. రేగిడి పోలీసులు కేసు నమోదు చేశారు..

ఆ కుటుంబాన్ని ఆదుకోవాలి

నెల్లిమర్ల : అనారోగ్యంతో మృతి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఐసిడిఎస్ పిఓను సత్యవతిను కలిసి మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన కార్యకర్త స్థానాన్ని సీనియారిటీ ప్రకారం భర్తీ చేయాలని కోరారు. అలా కాని పక్షంలో ఆందోళన చేస్తామని తెలిపారు.

హక్కులకు భంగం కలిగితే కఠిన చర్యలు

బొబ్బిలి : విద్యార్థులు, బాలల హక్కులకు భంగం కలిగితే కఠిన చర్యలు ఉంటాయని ఫస్ట్ క్లాస్ జూనియర్ సివిల్ జడ్జి జె. సౌమ్య అన్నారు. గురుకుల పాఠశాలలో శనివారం న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలు, విద్యార్థుల హక్కులకు భంగం కలిగితే న్యాయ స్థానాలను ఆశ్రయించ వచ్చునన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం బాలలతో పనులు చేయించకుండా చదివించాలని కోరారు. క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ప్రసన్నకుమార్, ప్రిన్సిపాల్ రఘునాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సివిల్ జడ్జి సౌమ్య